క్లుప్తంగా

పంటలపై అడవిపందుల దాడులు

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామానికి చెందిన వార్స నరేందర్ అనే రైతుకు చెందిన రెండున్నర ఎకరాలలో రబీలో జొన్న పంట సాగు చేయగా శుక్రవారం అడవి పందులు ధ్వంసం చేశాయి. ఆరుగాలం కష్టపడి పంట సాగు చేస్తున్న రైతుకు నిరాశే మిగిలింది. లక్ష రూపాయలు పెట్టుబడికి ఖర్చులు కాగా, జొన్న పంట చేతికి వచ్చే సమయానికి అడవి పందులు పంటను మొత్తం ధ్వంసం చేయడంతో రైతు చేసేది లేక పంట సాగు కోసం దాదాపు లక్ష రూపాయలు చేసిన అప్పును ఎలా తీర్చాలో తెలియడం లేదని వాపోయాడు. సంబంధిత అటవీ, వ్యవసాయ శాఖల అధికారులు ఆదుకోవాలని కోరుతున్నారు.

సొనాలలో నీటి ఎద్దడి



నీటి కోసం వెళ్తున్న కాలనీవాసులు

బోథ్: సొనాల మండల కేంద్రంలో నీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలో భూగర్భజలాలు అడుగంటడంతో హనుమాన్ ఆలయ సమీపంలో నీటి కొరత తీవ్రంగా మారింది. దీంతో కాలనీవాసులు ఇతర కాలనీల్లోకి వెళ్లి నీటిని తమ ఇంటికి తీసుకెళ్తున్నారు. తమ కాలనీకి మో టార్లు, నల్లాల ద్వారా నీటిని అందించాలని కాలనీవాసులు కోరుతున్నారు. గ్రామంలో ఇప్పటివరకు రేషన్ బియ్యం కూడా ఇవ్వలేదన్నారు. రేషన్ బియ్యాన్ని వెంటనే అందివ్వాలని కోరారు.

ఇందిరమ్మ నమూనా ఇల్లు నిర్మాణానికి భూమిపూజ

తలమడుగు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ నామూనా ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ నసీర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు ఎలా నిర్మించాలలో నామూనా ఇల్లు నిర్మించడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల్లో ఇలానే ఇళ్లను నిర్మించడం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ: మండలంలోని ఇచ్చోడ, సర్వాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ రాజు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ సదానందం తెలిపారు. విద్యుత్ లైన్ పనులు చేపట్టడంతో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. పట్టణంలోని అశోక్ రోడ్, సోనార్‌గల్లి, ఖానాపూర్, బొక్కలగూడ, ధన్‌గర్‌గల్లి, కొలిపురా, మసూద్‌చౌక్, శాంతినగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

భూమిని ఆక్రమించిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మున్సి పల్ భూమిని ఆక్రమించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని భుక్తాపూర్‌లో గల ము న్సిపల్ భూమిని ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సాహబుద్దీన్ ఆక్రమించినట్లుగా తెలిపారు. గత 30 సంవత్సరాలుగా భూమి తన ఆధీనంలో ఉన్నట్లుగా తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి మున్సిపల్ నుంచి ఇంటి నెంబర్లు తీసుకున్నట్లుగా పేర్కొన్నారు. భుక్తాపూర్‌కు చెందిన మహ్మద్ అక్రంకు విక్రయించారన్నారు. ఎలాంటి లింక్ డాక్యుమెంట్స్ లేకుండా ఆక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టగా మున్సిపల్ ఉద్యోగులు అడ్డుపడితే కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తీసుకోచ్చారని పేర్కొన్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు వారిద్దరిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లుగా వివరించారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

బోథ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ బాలికల పాఠశాలలో స్థానిక నాయకుడు ఎలుక రాజు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మేడిచెల్మ ప్రవీణ్ కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు సురేశ్, గంగాధర్, రఘుపతి పాల్గొన్నారు.

10 వరకు సీసీఐ కొనుగోళ్లు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఈనెల 10 వరకు మాత్రమే సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ఉంటాయని ఇన్‌చార్జి మార్కెట్ కార్యదర్శి గజానంద్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పత్తి పంట వివరాలు కలిగిన రైతులు తమ వద్ద మిగిలి ఉన్న నాణ్యమైన పత్తిని సీసీఐలో సోమవారం వరకు విక్రయించుకోవాలని సూచించారు.

అగ్ని ప్రమాదాలతో జాగ్రత్త..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ మండలంలోని సోన్‌పెల్లి గ్రామంలోని వాగ్మరే ఇందిర. ఇటీవల సోన్‌పెల్లి ఈమె ఇంటిలో జరిగిన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. వీరు ఇటుక బట్టీల్లో రోజువారి కూలీలు. ఇంటి ఖర్చుల కోసం ఇటుక యాజమాని వద్ద నుంచి ముందుగానే రూ.1.30 లక్షలను తీసుకుని ఇంట్లో ఉంచుకున్నారు. కాని అగ్నిప్రమాదంలో డబ్బు పూర్తిగా కాలిపోయింది.

- అప్రమత్తత అవసరం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఇల్లు

సిరికొండ: వేసవిలో తరుచుగా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. అనుకొని ప్రమాదంలో ఇల్లు కాలిబుడిద అవుతాయి. దీంతో ప్రజలు ఆర్థికంగా నష్టపోతారు. అంతేకాకుండా పలుమార్లు అగ్ని ప్రమాదాల వల్ల ప్రాణాలు కూడా పోతాయి.

అగ్గి రాజుకుంటే బుగ్గే..

వేసవిలో అగ్గి రాజుకోవాలంటే చిన్న నిప్పు కణం చాలు. ఊరు ఊరంతా బుగ్గిపాలు అవుతుంది. వేసవిలో ఎక్కువగా జరిగే ప్రమాదాల్లో అగ్ని ప్రమాదాలు మొదటి స్థానం. మండలంలో సుమారుగా 52 గ్రామాలున్నాయి. మండల కేంద్రం చుట్టూ గిరిజన పల్లెలు ఉన్నాయి. కలపతో, గడ్డివాముతో నిర్మించిన గుడిసెలే అధికం ఉండడంతో ప్రమాద తీవ్రత కూడా అధికంగా ఉంటుంది. అగ్ని మాపక కేంద్రంలో దగ్గరలో లేకపోవడం ఆస్తులు పూర్తిగా దగ్ధమవుతున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ముందుగా ఇంట్లో విద్యుత్ సరఫరాకు కరెంట్ పోల్ నుంచి సర్వీస్ వైరునే వాడాలి.
- ఎక్కడైన నాసిరకం, కట్ అయిన వైర్లను చూసుకోవాలి.
- వేసవిలో ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్త, చెదారం లేకుండా చూసుకోవాలి.
- పంట పొలం చుట్టూ సరిహద్దుల్లో ఎండు గడ్డి లేకుండా చూసుకోవాలి.
- ఎండిన పంటలను వెంటనే తొలగించాలి.
- చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు ఇవ్వకూడదు.
- గ్యాస్ సిలిండర్ ఆఫ్ చేయాలి.

సమాచారం అందించాలి

మండలంలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వాలి. సమాచారం అందిన వెంటనే తక్షణ సహాయ చర్యలు తీసుకుంటాం. వేసవిలో అగ్నికి దూరంగా ఉండాలి.

– అశోక్, ఫైర్‌స్టేషన్ ఆఫీసర్, ఇచ్చోడ

అవగాహన కల్పించాలి



వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తాయి. ప్రజలకు అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించాలి. అగ్గి అంటుకుంటే ముందు ఎలాంటి చర్యలు తీసుకోవాలి వంటి సూచనలు, సలహాలు ఇవ్వాలి.

– పోయాం బారిక్‌రావు, వాయిపేట్

నిర్లక్ష్యం చేయవద్దు



ఇంట్లో విద్యుత్ ప్రమాదాలను నివారించాలంటే విద్యుత్ తీగలు నాణ్యమైనవి ఉండేలా చూడాలి. ముఖ్యంగా సర్వీస్ వైర్లు వాడాలి. సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతుండగా నిర్లక్ష్యం చేయవద్దు, వేసవిలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లే విద్యుత్ బటన్‌లను ఆఫ్ చేయాలి.

– నందు, విద్యుత్ లైన్‌మెన్, సిరికొండ

సభ విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ మహిళా సంఘం, తుడుందెబ్బ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవం, ఆదివాసీల అస్తిత్వ పోరుగర్జన సభకు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలో కుమురం భీం గూడలో నిర్వహించనున్న పోరుగర్జన ఏర్పాట్లను పరిశీలించారు. శనివారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలో కుమురం భీం కాలనీలో అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవం వేడుకలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, గోడం రేణుకా, ఉయిక ఇందిరా, సోయం లలితా, ఆత్రం గణపతి, వెడ్మ ముకుంద్ రావు, తొడసం ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ఘనంగా సనాతన్ ధర్మ్ వార్షికోత్సవం

ఇంద్రవెల్లి: సనాతన్ ధర్మ్ సేవ సమితి మొదటి వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇచ్చోడ మండలంలోని మాదపూర్‌కు చెందిన నారాయణ మహరాజ్, అందునాయక్‌తండా గ్రామానికి చెందిన రాంసింగ్‌బాబా, హోల్‌వాడి గ్రామానికి చెందిన విష్ణు మహరాజ్‌లతో మండల కేంద్రంలోని అంజీచౌక్ నుంచి రాధాకృష్ణ ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాధాకృష్ణ ఆలయంలో హాజరైన మహరాజ్‌ల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనలు బోధించారు. ప్రతీ ఒక్కరూ సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందారిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి గ్రామపటేల్ మారుతి డొంగ్రె, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

'లక్క సాగుతో ఉపాధి'

బజార్‌హత్నూర్: అటవీ ప్రాంతంలోని గిరిజనులు లక్క సేకరణతో ఉపాధి పొందవచ్చని ఇచ్చోడ ఎఫ్ఆర్‌వో పుండలిక్ తెలిపారు. మండలంలోని కొలారి, అందుగూడ, కొత్తగూడ, చింతకర్ర, గిరిజాయి, డేడ్ర, మాన్కపూర్, ఉమర్డ గ్రామాల గిరిజనులకు శుక్రవారం జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్‌వో పుండలిక్ ఆధ్వర్యంలో డేడ్ర గ్రామంలో లక్క సాగు, అటవి ఉత్పత్తులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ అడవుల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని, అడవులను రక్షించుకుని అటవీ ఉత్పత్తుల ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్‌వో ప్రవీణ్ మహాజన్, ఎఫ్‌బీవోలు కేశవ్, తిరుపతి, జ్ఞానేశ్వర్, గిరిజనులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్‌వో పుండలిక్

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

తలమడుగు: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షల కేంద్రాన్ని శుక్రవారం తాహసీల్దార్ రాజ్‌మోహన్, ఎస్సై అంజమ్మ తనిఖీ చేశారు. తహసీల్దార్ రాజ్ మోహన్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి మాస్‌కాపీయింగ్ జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

తలమడుగు: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి ప్రణీత అన్నారు. శుక్రవారం మండలంలోని దేవాపూర్ జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈనెల 21 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు మంచిగా ఉత్తీర్ణత సాధిచాలన్నారు. జిల్లాలో మొత్తం 52 పరీక్ష కేంద్రాల్లో 10100 మంది హాజరు కావడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఉపాధ్యాయులు అందించిన సలహాలు సూచనలు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఎస్‌వో నారాయణ, దీలిప్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

బైక్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన దస్నాపూరి రాజు బైక్ చోరీకి గురైంది. గతేడాది డిసెంబర్ 22న భుక్తాపూర్‌లోని తన హోటల్ పక్కన పార్కింగ్ చేశాడు. సాయంత్రం తిరిగి వచ్చే సరికి కనిపించకుండా పోయింది. దీంతో శుక్రవారం వన్‌టౌన్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయగా.. సీఐ సునీల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దొంగల అరెస్ట్

ఆదిలాబాద్ టౌన్(జైనథ్): ద్విచక్రవాహనాన్ని దొంగలించిన వ్యక్తులను జైనథ్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. జైనథ్ మండల కేంద్రానికి చెందిన జగదీష్ రెడ్డి అనే వ్యక్తి బైక్ ఈనెల 3న దొంగలించబడింది. బాధితుడి మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దొంగలను గుర్తించారు. బైక్ ఎత్తుకెళ్లిన ఇప్ప కార్తీక్, ఇప్ప ఈశ్వర్‌లను పట్టుకొని బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

చికిత్స పొందుతూ భార్య మృతి

నేరడిగొండ: మండలంలోని వడూర్‌కు చెందిన రైతు ఇదావు పోశెట్టి బుధవారం మృతి చెందగా అతడి భార్య ఇందిర (52) శుక్రవారం మృతి చెందింది. అప్పుల బాధ భరించలేక బుధవారం ఇద్దరు పురుగుల మందు తాగారు. ఇందిరా పరిస్థితి విషమంగా ఉండగా శుక్రవారం ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బోథ్‌లో యువకుడు

బోథ్: పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై ఎల్. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని చింతగూడకు చెందిన గెడం వినోద్ కమార్ (25) తరచూ సారా తాగేవాడు. గతనెల 12న సాయంత్రం సారా తాగి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు లక్ష్మీ, దేవ్‌రావ్ మందలించారు. మనస్తాపం చెందిన వినోద్ కుమార్ అదేరోజు రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. కోలుకున్నాక ఇంటికి తీసుకువచ్చారు. మళ్లీ అనారోగ్యం బారిన పడ్డాడు. గతనెల 28న బోథ్ సీహెచ్‌సీలో ఈనెల 4వ తేదీ వరకు చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం బంధువులు నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందాడు.

ఇందిరమ్మ ఇళ్లపై రీ సర్వే చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: ఇందిరమ్మ ఇళ్లపై రీ సర్వే చేయాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గతంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితా ఆధారంగా ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. సర్వేలో ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను పాటించాలన్నారు. సమావేశంలో ఎంపీవో సత్యానంద్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ రోడ్డుతో పాటు ఇన్కార్‌గూడ, ముత్నూర్ గ్రామాలకు సందర్శించి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో మంజూరైన సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, మీర్జా యాకుబ్‌బేగ్, కోరెంగా సుంకట్‌రావ్, జితేందర్, మసుద్, జహిర్ పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

అధైర్యపడొద్దు నేనున్నా..

ఉట్నూర్‌రూరల్: మండలంలోని చింతగూడ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో పంద్రం గంగాధర్ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గ్రామాన్ని సందర్శించి, ఇంటిని పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాంగిడి గ్రామంలో ఆధ్యాత్మిక గురువులు శ్రీ సంత్ తుక్‌డోజీ మహరాజ్ 56వ, మోతిజీ మహరాజ్ 27వ పుణ్య తిథి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని పల్లకి ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, ఆధ్యాత్మిక గురువుల ప్రధాన శిష్య బృందం, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పల్లకి ఊరేగిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజర్షిషా

ఇంద్రవెల్లి: ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని క్రిసెంట్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఆర్‌డీవో పీడీ రాథోడ్ రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు సమస్యలు లేకుండా చూడాలి

వసతి గృహం విద్యార్థినులకు ఎలాంటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్‌లో కస్తూరిబా గాంధీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినులకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలు, మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. ఎండకాలం దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీరోజు మెనూ ప్రకారం.. భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు యూడీఐడీ గుర్తింపు కార్డులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కై లాస్‌నగర్: దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్‌ల స్థానంలో ప్రత్యేక యూడీఐడీ కార్డులను కేంద్రం జారీ చేయనున్నట్లుగా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూడీఐడీ అధికారులు, దివ్యాంగులు, వైద్యాధికారులు, ఏపీఎంలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. దివ్యాంగుల కోసం జాతీయ డేటాబేస్‌ను రూపొందించే ఉద్దేశంతో యూడీఐడీ ఉప పథకం అమలు చేయబడుతుందన్నారు. గతంలో మాదిరి కాకుండా నేరుగా పోస్టు ద్వారా దరఖాస్తుదారులకు కార్డులు అందుతాయన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమాధికారి మిల్కా దివ్యాంగుల కమిటీ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు, యువతులు, విద్యార్థినులు అన్నిరంగాల్లో రాణించాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అతీఖ్ బేగం, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని భోరజ్ మండలం పిప్పర్ వాడ జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు శశికళ అన్నారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వివిధ రంగాలలో గొప్పగా నిలిచిన మహిళామణుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

ఆదిలాబాద్‌టౌన్: అభివృద్ధితో పాటు అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళలు మరింత చైతన్యవంతులు కావాలని రిటైర్డ్ లెక్చరర్ సుజాత అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన 114వ అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రస్తుతం సమాజంలో మహిళలు ఎదుగుతున్న తీరు, జరుగుతున్న దాడుల గురించి వివరించారు. మహిళలు చైతన్యవంతులు కావాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న సౌజన్య

- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కళాశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపల్‌తో పాటు మహిళా లెక్చరర్లు, సిబ్బంది, ఆఫీస్ సబార్డినేట్‌లను శాలువాతో సన్మానించారు. ప్రిన్సిపల్ జె.సంగీత, లెక్చరర్లు శ్రావణి, శ్రీధర, సాలేహా, ఆఫ్రీన్, సుమయ్య, రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ బిల్లు వ్యతిరేకిస్తున్నాం'

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఎస్సీ వర్గీకరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఒకే వర్గానికి మద్దతుగా నిలుస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి మాలలపై అక్కసుతో అన్యాయం చేస్తూ, సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఏక సభ్య కమిషన్ గడవు పెంచి గడువు ముగియకుండానే శాసనసభలో వర్గీకరణ బిల్లును ఆమోదింప చేయడం కోసం ప్రయత్నించడం మానుకోవాలన్నారు. వర్గీకరణ గురించి పునరాలోచన చేయాలన్నారు. నాయకులు మేకల మల్లన్న, పాశం రాఘవేంద్ర, బేర దేవన్న, అశోక్, స్వామి, భూమన్న, నర్సింలు, రాములు పాల్గొన్నారు.

దివ్యాంగ లబ్ధిదారు ఎంపిక

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఒక యూనిట్ 100 శాతం సబ్సిడీ రూ.50 వేల రుణ కోసం దివ్యాంగ లబ్ధిదారు ఎంపిక నిర్వహించారు. రుణం కోసం 62 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా.. లక్కీడ్రా ద్వారా గూడకు చెందిన వైద్య అకాష్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్‌కుమార్, టైపిస్ట్ మతిన్, జూనియర్ అసిస్టెంట్ శశికిరణ్ పాల్గొన్నారు.